www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 293 ISSUE : 293 | శుక్రవారం, 20 మార్చి, 2026 FRIDAY, MARCH 20, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు చొరవ చూపండి

- ప్రపంచ నేతలకు మోడీ విజ్ఞప్తి..!

2 లో..





## ఇది రైతు నామ సంవత్సరం

2 లో..

- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి.. రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- రైతు సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

## సినీ హబ్‌గా హైదరాబాద్!

- భారతీయ సినిమా అంటేనే తెలుగు సినిమా
- సినీ పరిశ్రమకు ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణలు.. నాలుగు మినార్‌లు!
- ప్రభాకర్‌రెడ్డి 'కార్మిక బంధు'గా నిలిచారు
- ఐటీ, ఫార్మా మాదిరిగా సినీ పరిశ్రమనూ గుర్తించాం
- అందుకే నిలిచిపోయిన నంది అవార్డులను గద్దర్ పేరుతో పునరుద్ధరించాం
- కథతో హైదరాబాద్‌కు వచ్చి రీల్‌తో వెళ్లొచ్చు
- సినిమా అంటే రెండువైపులా పదునున్న ఆయుధం
- దాన్ని సమాజహితానికే ఉపయోగించండి
- డ్రగ్స్‌పై పోరులో సహకరించండి
- తెలంగాణ కంటే సురక్షిత ప్రాంతం మరొకటి లేదు
- గద్దర్ సినీ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 19:

''భారతీయ సినిమా అంటేనే తెలుగు సినిమా అని, దానికి అసలైన వేదిక హైదరాబాద్'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ అంటే కేవలం ఐటీ, ఫార్మా పరిశ్రమలకు, హైదరాబాద్ బిర్యానీకి మాత్రమే గుర్తింపు కాదని.. జాతీయ స్థాయిలో సినీ పరిశ్రమకు వేదికగా రాణించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులు-2025 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. చెన్నైలో ఉన్న సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ కలిసి చార్మినార్‌కు ఉన్న 4 మినార్‌ల లాగా కృషి చేశారని చెప్పారు. సినీ కార్మికుల కోసం నటుడు ప్రభాకర్‌రెడ్డి తన సొంత స్థలాన్ని దానం చేసి, కార్మిక బంధుగా నిలిచారని కొనియాడారు. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా పెద్దన్నగా నిలబడి, సమస్యలను పరిష్కరించి శాశ్వతంగా సినీ పరిశ్రమ హైదరాబాద్‌లో నిలదొక్కుకోవడానికి, గుర్తింపు తేవడానికి పెద్దలంతా కృషి చేశారని చెప్పారు. హైదరాబాద్‌ను మిగతా 2లో..



సౌదీ, ఖతార్‌ల కీలక చమురు క్షేత్రాలపై

## ఇరాన్ దాడులు

### భారత్‌పై తీవ్ర ప్రభావం

2 లో..

## నేడే బడ్జెట్..

- మధ్యాహ్నం 12 గంటలకు ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క
- శాసన మండలిలో ప్రవేశపెట్టనున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



2 లో..

## డాడీ.. మోడీ.. చిన్న మోడీపైనే నా పోరాటం

- నేను దూరమయ్యాక నిజామాబాద్‌లో బీఆర్ఎస్ బాగా నష్టపోయింది
- వనపర్తి నుంచి పోటీ చేయమని కార్యకర్తలు కోరుతున్నారు
- బీఆర్ఎస్‌తో నాకున్న విభేదాలను రేవంత్ రెడ్డి అవకాశంగా చేసుకుంటున్నారు
- త్వరలోనే కొత్త పార్టీని ప్రకటిస్తా దాని కంటే ముందు జాతీయ స్థాయి నేతలను కలుస్తా
- మీడియా చిట్‌చాట్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 19:

''నేను ఎవరితోనూ రాజీపడను.. ఆ అవసరం కూడా నాకు లేదు. నా పోరాటమంతా డాడీ (కేసీఆర్), మోడీ (ప్రధాని), చిన్నమోడీ (సీఎం రేవంత్‌రెడ్డి) పైనే'' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో గురువారం మిగతా 2లో..







# సినీ హబ్‌గా హైదరాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ సినీ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. కాగా, ఐటీ, ఫార్మా పరిశ్రమల మాదిరిగానే సినీ పరిశ్రమను కూడా గుర్తించామని.. అందుకే ఆగిపోయిన నంది అవార్డులను గద్దర్ పేరుతో తిరిగి ప్రవేశపెట్టామని రేవంత్ చెప్పారు.

కొత్త ప్రతిభను గుర్తించడం, ప్రోత్సహించడం రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాన బాధ్యత అని పేర్కొన్నారు. జపాన్, కొరియా సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయంటే అది అక్కడి ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, విధానాల వల్లేనని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో నలుపు-తెలుపుతో మొదలైన సినీ ప్రస్థానం నేడు డాల్బీ థియేటర్లను ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగిందని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ తమ స్టూడియోను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ కూడా వచ్చినట్లేనని పునరుద్ఘాటించారు. ఎవరైనా సినిమా నిర్మించాలనుకునే వారు కథతో వచ్చి రీల్స్‌తో వెళ్లేలా హైదరాబాద్‌లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సినీ రంగానికి ఉపయోగపడే పరిశ్రమలను ఏకగవాక్ష విధానం ద్వారా తమ ప్రభుత్వం అనుమతులిస్తోందన్నారు.

గద్దర్ అంటేనే ఒక చైతన్యం..

"గద్దర్ అంటే ఒక చైతన్యం, ఒక స్ఫూర్తి. తన పాటతో వేలాది మందిలో చైతన్యం తీసుకొచ్చిన ఆయన పేరుతో ఈ అవార్డులు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సినిమా అనేది ప్రభావవంతమైన, శక్తిమంతమైన ఆయుధమని అన్నారు. అలాగే సినిమా అనేది రెండువైపులా పదును ఉన్న కత్తిలాంటిదని, దీన్ని సమాజాన్ని



చైతన్యపరిచేందుకు ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. గద్దర్ స్ఫూర్తితో సామాజిక రుగ్మతలను, సమస్యలను రూపుమాపేందుకు సినిమాల ద్వారా సందేశం అందించాలని కోరారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలను మన సైన్యం ఆపరేషన్ సిందూర్‌తో అణచివేసిందని.. ఆ సమయంలోనే తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించామని గుర్తుచేశారు. ఏ ప్రాంతంలో ఏం జరిగినా తెలంగాణలో మాత్రం కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణను మించిన సురక్షితమైన ప్రాంతం మరొకటి ఉండదని చెప్పారు. అందుకే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు ఇస్తున్నామన్నారు.

డ్రగ్స్‌పై యుద్ధంలో ముందుండాలి..

"డ్రగ్స్ మహమ్మారి వల్ల ఒక తరం నాశనమైపోతోంది. దీనికి వ్యతిరేకంగా పోరాడడంలో సినీ పరిశ్రమ ముందుండాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. థియేటర్లలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా వీడియోలు ప్రదర్శించాలని నిర్మాతలకు సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని స్పష్టం చేశారు.

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే 'విజన్ 2047'లో సినీ రంగాన్ని ప్రత్యేక అధ్యాయంగా చేరుస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సినీ పరిశ్రమకు పలు హామీలు ఇచ్చారు.

షూటింగ్ అనుమతుల కోసం వేగవంతమైన ఏకగవాక్ష విధానం అమలు.

చిన్న సినిమాలకు థియేటర్ల లభ్యత, పన్ను మినహాయింపులు, పరిశ్రమల తరహాలో విద్యుత్తు రాయితీలు.

సినీ కార్మికులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల కేటాయింపుపై స్పష్టమైన విధానం.

హైదరాబాద్ చుట్టుపక్కల అంతర్జాతీయ స్థాయి స్టూడియోల ఏర్పాటుకు భూముల కేటాయింపు.

## తెలంగాణ ఆత్మను ప్రపంచానికి వ్యాప్తి చేసిన వ్యక్తి గద్దర్: భట్టి

గద్దర్ ఒక వ్యక్తిగా కాకుండా వ్యవస్థగా తన ఆట, పాటలతో తెలంగాణ ఆత్మను ప్రపంచానికి తెలియజెప్పారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అందుకే ఆయన పేరుమీదుగా తమ ప్రభుత్వం ఫిలిం అవార్డులను అందిస్తోందని తెలిపారు. తెలుగు సినిమా కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా.. దేశానికే తలమానికంగా ఎదగాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఈ అవార్డులను ప్రవేశపెట్టారని కొనియాడారు. తెలుగు సినిమాలు కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దక్షిణ భారత రాష్ట్రాలకు, బాలివుడ్‌తో పాటు, హాలీవుడ్ స్థాయికి ఎదిగిన తీరును మనమంతా చూస్తున్నామని ప్రశంసించారు. సినిమా అంటే కేవలం కళల కోసమే కాదు, ప్రజల కోసం అని చాటిన అనేక తెలుగు సినిమాలను చూశామన్నారు. సత్యహరిశ్చంద్ర, కన్యాశుల్కం, రోజులు మారాయి, మరో ప్రపంచం, కాలం మారింది, దానవీర శూరకర్ణ లాంటి అనేక చిత్రాలు సందేశాన్నివ్వడమేకాక, సమాజ మార్పు కోసం కృషి చేశాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సందేశాత్మక చిత్రాలు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, పారదర్శకంగా విజేతలను ఎంపిక చేసిన చైర్మన్ దిల్‌రాజుకు మంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

# ఇది రైతు నామ సంవత్సరం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 19:

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతును రాజును చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం రైతు నామ సంవత్సరమని వ్యాఖ్యానించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో గురువారం భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు, రైతు కూలీలకు పెద్ద పండుగ ఉగాది అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదుకొని, పంటకు బోనస్ కూడా అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే రైతుల విషయంలో అతి తక్కువ రుణభారం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని కేంద్రం ప్రకటించడం గర్వకారణమని పేర్కొన్నారు. రైతు బాగున్నప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విరజిల్లుతుందని అభిప్రాయపడ్డారు. అందుకే 25,35,000 మంది రైతు కుటుంబాలకు రూ.20,616కోట్ల మేర రుణమాఫీ చేశామని తెలిపారు. ఇప్పటికే రైతు భరోసా పథకానికి రూ.18వేల కోట్లు ఖర్చు చేశామని, 22 న మరోసారి రైతు భరోసా నిధులను విడుదల చేయబోతున్నామని వెల్లడించారు. ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు రాకుండా, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.




# డాడీ.. మోడీ.. చిన్న మోడీపైనే నా పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఆమె మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్‌కు దూరమైన తర్వాత నిజామాబాద్ జిల్లాలో ఆ పార్టీ పూర్తిగా నష్టపోయిందన్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో జాగృతి పార్టీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ అని కాదు.. చాలాచోట్ల నుంచి తనను ఎన్నికల్లో పోటీ చేయమంటున్నారని, ఇటీవల వనపర్తి నుంచి పోటీ చేయాలని జాగృతి కార్యకర్తలు కోరుతున్నారని తెలిపారు. అయితే, ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే విషయాన్ని సమయానుగుణంగా నిర్ణయించుకుంటానని చెప్పారు. బీఆర్‌ఎస్‌తో తనకున్న విభేదాలను సీఎం రేవంత్‌రెడ్డి అవకాశంగా తీసుకుంటున్నార ని ఆరోపించారు. తనకు ఎటువంటి బేషజాలు లేవని, అందరినీ కలుపుకొనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో విశారదన్, ప్రజా సంఘాలు, సీపీఎం, సీపీఐఎం ఎల్ న్యూడెమొక్రసీ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామని వెల్లడించారు. సామాజిక తెలంగాణ ధ్యేయంతో.. సర్వోదయ రాష్ట్రం దిశగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకోసం గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్నిఅధ్యయనం చేస్తున్నానని చెప్పారు. మంచి ముహూర్తం చూసుకొని తన కొత్త పార్టీని త్వరలోనే ప్రకటిస్తానని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన యువతకు రాజకీయంగా అవకాశం కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ప్రభావం కచ్చితంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే పార్టీ ప్రకటనకు ముందే... శ్రీరామనవమి తర్వాత పలువురు జాతీయ స్థాయి నేతలను కలవనున్నానని కవిత తెలిపారు. కాగా, తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కవిత కొత్త పార్టీని త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

## 2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జాగృతి ప్రజా బడ్జెట్ పేరిట ఆ సంస్థ అధ్యక్షురాలు కవిత రూ.2,15,200కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ప్రభుత్వం 3లక్షల కోట్లకు పైగా అంచనాలతో బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, తాము 2.15లక్షల కోట్లతోనే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ప్రజల సూచనల మేరకే ప్రజా బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ప్రజా బడ్జెట్‌లో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్ద పీట వేశామని, కాగా సంక్షేమ పథకాలను గాంధీ కుటుంబ సభ్యులే కాదు తమకు నచ్చిన వారి పేర్లతో ప్రకటించుకోవచ్చన్నారు. తాము ప్రతిపాదించిన బడ్జెట్ వల్ల రాష్ట్ర పురోగతితో పాటు సంపద సృష్టి కూడా జరుగుతుందని కవిత పేర్కొన్నారు.

# నేడే బడ్జెట్..

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 19:

తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన ఘట్టానికి ముహూర్తం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేపు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. శుక్రవారం ఉదయం బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించనుంది. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతారు. శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. గతేడాది రూ.3.05లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను శాసన సభ ముందుంచిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈసారి అంకెల గారడీలు చేస్తారా? అభివృద్ధి, సంక్షేమానికి భారీగా కేటాయిస్తారా? అనేది రేపు మధ్యాహ్నం లోపు తెలియనుంది.








సౌదీ, ఖతార్‌ల కీలక చమురు క్షేత్రాలపై

# ఇరాన్ దాడులు

## భారత్‌పై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: గల్ఫ్ దేశాల చమురు నిల్వ కేంద్రాల్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ వైమానిక దాడులకు పాల్పడుతోంది. ఇప్పటికే యూఏఈ, ఖతార్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడులు చేసిన ఇరాన్ తాజాగా సౌదీ అరేబియాలోని ప్రధాన పట్టణం యన్బులోని రెడ్ సీ పోర్టు వద్ద గల సౌదీ అరాంకో సంస్థకు చెందిన చమురు రిఫైనరీలపై దాడి చేసింది. అయితే, ఈ దాడిలో భారీ నష్టమేమీ కలగలేదని అరాంకో సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్.. గల్ఫ్ దేశాలపై దాడికి దిగుతోంది. ముఖ్యంగా అక్కడి చమురు నిల్వ కేంద్రాలు, రిఫైనరీలు లక్ష్యంగా చేసుకుని మిస్సైల్ దాడులకు పాల్పడుతోంది. ఖతార్‌లోని ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఎన్‌జీ (లిక్విఫైడ్ రిఫైనరీ గ్యాస్) రిఫైనరీ ప్లాంట్ అయిన రస్ లఫ్ఫాన్‌పై దాడి చేసింది. దీంతో ఇక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధి మూసుకుపోయి చమురు రవాణా స్తంభించిన నేపథ్యంలో ఇప్పుడు గల్ఫ్‌లోని



చమురు కేంద్రాలపై దాడులు జరగడం ప్రపంచాన్ని మరింత కలవరపెడుతోంది. ముఖ్యంగా గ్యాస్ ఉత్పత్తి తగ్గిపోతే అనేక దేశాలు ఇంకా సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి. ఇప్పటికే సరైన చమురు సరఫరా లేకపోవడంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 110 డాలర్లకు చేరింది. ఇప్పుడు గల్ఫ్ కేంద్రాలపై దాడులు, అక్కడ చమురు ఉత్పత్తి నిలిచిపోతే ఆయిల్ సరఫరాకు ఇంకా ఇబ్బంది కలుగుతుంది. ఇండియాపైన కూడా ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మనం 50 శాతం చమురును అంతర్జాతీయ మార్కెట్ల నుంచే కొనుగోలు చేస్తున్నాం. ఖతార్ నుంచి 20 శాతం ఎల్ఎన్‌జీని కొనుగోలు చేస్తున్నాం. అలాంటిది అక్కడి నుంచి ఉత్పత్తి, రవాణా తగ్గిపోతే ఇండియాపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి, విద్యుత్ ఉత్పత్తికి ఎదురుదెబ్బ తగులుతుంది. ప్రస్తుతం ఇండియా ప్రతిరోజూ 189 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూమిక్ మీటర్స్ (ఎంఎంఎస్‌సీఎండీ) పర్ డే వినియోగిస్తోంది. ఇందులో 97.5 ఎంఎంఎస్‌సీఎండీ మాత్రమే ఇండియాలో ఉత్పత్తి అవుతోంది.



పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు

# చొరవ చూపండి

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ నేతలతో మాట్లాడారు. సౌదీ అరేబియాలోని గ్యాస్ కేంద్రాలపై దాడులతో ప్రపంచ దేశాలకు గ్యాస్ కొరత ఏర్పడనున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తం కావాలని మోడీ కోరారు. పశ్చిమాసియాలో తక్షణ మే శాంతి స్థాపనకు చొరవ చూపాలని ఆయన గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, ఒమన్ సుల్తాన్‌ను విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయేల్, అమెరికా దాడులకు ప్రతిచర్యగా సౌదీ అరేబియాలోని గ్యాస్ రిఫైనరీ కేంద్రాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఫలితంగా ముడి చమురు ధర.. లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. యుద్ధం ఇలానే కొనసాగితే గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ముప్పు తప్పేలా లేదు. దాంతో.. తక్షణమే పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరత స్థాపనకు కృషి చేయాలని భారత ప్రధాని ప్రపంచ నేతలను కోరారు. ఇదే అంశంపై గురువారం ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు, మలేషియా ప్రధాని, ఒమన్ సుల్తాన్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. "నా ప్రియమైన స్నేహితుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్‌తో పశ్చిమాసియా యుద్ధం గురించి మాట్లాడాను. తక్షణమే యుద్ధ తీవ్రతను తగ్గించాల్సిన అవసరముందని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలనే విషయంపై ఆయనతో చెప్పాను. ఆ ప్రాంతంలో శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొనేందుకు అవసమరమైన సాయం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని వివరించాను'' అని మోడీ తన ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించారు. నా స్నేహితుడు, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో మాట్లాడా ను. హరి రయా ఐదిల్‌ఫిత్రి పండుగను పునస్కరించుకొని ఆయనకు, మలేషియా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశాను. అనంతరం.. ప్రపంచాన్ని కలవరపరుస్తున్న పశ్చిమాసియాలో యుద్ధం గురించి ద్ధరం చర్చించాం. చర్చల ద్వారా, రాయబారం ద్వారా ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, వీలైనంత తొందరగా శాంతి స్థాపనకు, సుస్థిరత నెలకొల్పడానికి కృషి చేయాల్సిన అవసరముందని ఇరువురం భావించాం అని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "నా సోదరుడు సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్‌తో సంభాషణ అర్థవంతంగా సాగింది. ఒమ న్ ప్రజలకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశాను. పశ్చిమాసి యాలో శాంతి స్థాపన అత్యవసరమని, అక్కడ సుస్థిరత ఏర్పాటు గురించీ మాట్లాడుకున్నాం. ఒమన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే లా దాడులు చేయడాన్ని భారత్ ఖండిస్తుందనే విషయాన్ని మరోమారు తెలియజేశాను.

సంపుటి 1 సంచిక 293 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, మార్చి 20, 2026




# ఉగాది సందర్భంగా శ్రీ మల్లన్న స్వామి దర్శనం చేసిన పార్వతల రాజేందర్

మైలర్ దేవ్ పల్లి, మర్చి 19 ( వార్త వేదిక సూర్య )

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఫలక్‌నుమా లోని శ్రీ మల్లన్న స్వామి దేవాలయాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్వతల రాజేందర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, ఉగాది తెలుగు ప్రజల ఆధ్యాత్మిక, సాంప్రదాయ విలువలను ప్రతిబింబించే ముఖ్యమైన పండుగ అని తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతో షాలతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో నిండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# బాబుల్ రెడ్డి నగర్‌లో ఏప్రిల్ 19న హిందూ సమ్మేళనం

మైలర్ దేవ్ పల్లి, మర్చి 19 ( వార్త వేదిక సూర్య ) :

బాబుల్ రెడ్డి నగర్‌లో వచ్చే నెల ఏప్రిల్ 19వ తేదీన భారీ ఎత్తున "హిందూ సమ్మేళనం" నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేడం వెంకటరమణ గుప్తా, పల్లపు జగన్ మల్లేష్ మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనం బొడ్డురాయి చౌరస్తాలో నిర్వహించబడుతుంది. కమిటీ అధ్యక్షుడిగా వలకొండా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా సిద్రాల సంతోష్, కోశాధికారిగా చెన్న శ్రీరామ్ నియమితులయ్యారు. ఇటీవల నిర్వహించిన సన్నాహక సమావేశంలో గోపాల్ నాయక్, కల్యాణి సత్యనారాయణ, సాయిరాం, సెంట్రింగ్ శంకర్, రామకృష్ణ, శివాజీ, శివరాజ్, ప్రవీణ్ కుమార్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం చేయడానికి ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.





# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ - కంది శైలజ శ్రీకాంత్

సికింద్రాబాద్, మార్చి 19(వార్త వేదిక సూర్య)

శ్రీ పరభావనామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ను బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు కలకం నిలిచి ఉండాలని అదేవిధంగా కోరిన కోర్కెలు నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేష్, మల్లేష్, గౌడ్ శ్రీను, వెంకటేశ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మరియు మాజీ మంత్రి కేటీఆర్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్, మార్చి 19(వార్త వేదిక సూర్య)





మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ మరియు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉగాది తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పర్వదినమని పేర్కొన్నారు. ఈ కొత్త సంవత్సరం అందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజేష్, పాక సాయి తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన డివిజన్ నాయకులు



మైలర్ దేవ్ పల్లి, మర్చి 19 ( వార్త వేదిక సూర్య ) :

మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డికి గురువారం డివిజన్ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఉగాది తెలుగు నూతన సంవత్సరానికి నాంది పలుకుతూ ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. భగవంతుని కృపతో డివిజన్ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు అడికె జనార్ధన్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్, మన్మోహన్ రెడ్డి, రామిడి మధుసూదన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, ఆడికె శివశంకర్, సచిన్ షిండే, పొప్పట్ మానే, విఠల్ షిండే తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

మైలర్ దేవ్ పల్లి, 18 ( వార్త వేదిక సూర్య ) :

వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ మణికొండ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి సంబంధించి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవం ఈ నెల 27వ తేదీ శుక్రవారం అల్కాపూర్ రోడ్ నెంబర్ 25లోని మహాత్మా గాంధీ పార్క్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఓలం యాదగిరి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. మణికొండ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆహ్వానించారు.



# ఎమ్మెల్యే వేముల వీరేశం కు ఉగాది శుభాకాంక్షలు అందజేసిన సూర్య ప్రభంజనం ఎడిటర్ ఏటెల్లి శ్రీనివాస్



రామన్నపేట ( వార్త వేదిక సూర్య )మార్చి 19

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ని మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు అందజేసిన సూర్య ప్రభంజనం ఎడిటర్, రామన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏటెల్లి శ్రీనివాస్ , ఆయన వెంట జాతీయ వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బోదాసు రవి, నాయకులు కుమ్మరి బద్రి, చిన్నలచ్చి సైదులు, తేలకలపల్లి వెంకటేశం లు ఉన్నారు.



# ఉప్పర్‌పల్లిలో ఉగాది పంచాంగ శ్రవణం

మైలర్ దేవ్ పల్లి, మర్చి 19 ( వార్త వేదిక సూర్య ) :



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పర్‌పల్లి గ్రామంలో ఆనవాయితీగా పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు కలిసి శివాంజనేయ స్వామి దేవాల యంలో పండితుడు కృష్ణ ప్రసాద్ శర్మ చేత పంచాంగ శ్రవణం నిర్వహించారు. పంచాంగ శ్రవణంలో కొత్త సంవత్సరానికి సంబంధించిన ఫలితాలు, శుభాశుభాలు వివరించగా, గ్రామస్తులు ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.


# నార్సింగి సర్కిల్‌లో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహణ

మైలర్ దేవ్ పల్లి, 19 ( వార్త వేదిక సూర్య ) :



నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు సంప్రదాయ పద్ధతిలో నూతన సంవత్సర ఫలితాలను వివరిస్తూ పంచాంగాన్ని వినిపించారు. పూజలు నిర్వహించి, నూతన సంవత్సరాన్ని శుభప్రదంగా ఆరంభించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపుటి 1 సంచిక 293 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, మార్చి 20, 2026






# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇంటి ద్వారా గృహవసతి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ జిల్లాకలెక్టర్, నకిరేకల్ ఎమ్మెల్యేల సమక్షంలో గృహప్రవేశాలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు





నల్లగొండ బ్యూరో, మార్చి 19 (వార్తా వేదిక సూర్య )

గురువారం నకిరేకల్ నియోజకవర్గం, చిట్యాల మండలం, గుండ్రంపల్లి, పెదకాపర్తి గ్రామాలలో పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులతో ఆనందోత్సాహాల మధ్య నూతన గృహప్రవేశాలు చేయించారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సందర్భంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లాలో 6,409 ఇందిరమ్మ గృహ ప్రవేశా లు నిర్వహించాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. అందులో భాగంగా ఉగాది రోజు నుండి వచ్చే రెండు, మూడు రోజుల్లో 2281 గృహప్రవేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ తెలిపారు.

నకిరేకల్ నియోజకవర్గంలోనే 348 ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకు అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన 5 లక్షల రూపాయలు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇంటి ద్వారా వారి కల సాకారం చేసుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పేదలకు నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను చేయించివారి ఇంటి కలను నిజం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు . ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గానికి తొలి విడతన 3,500 ఇండ్లు మంజూరు కాగా, అందులో 300కి పైగా ఇళ్లను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. గుండ్రంపల్లి, పెదకాపర్తి గ్రామాల్లో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించడం ఆనందదాయకమని, రాష్ట్రంలో తొలి విడత నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, త్వరలో రెండో విడత ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలో పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా కలెక్టర్ సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. రానున్న రెండు సంవత్సరాల్లో ఇల్లు లేని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇల్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమకు అందించిన ఇందిరమ్మ ఇళ్లతో తమ సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్ కుమార్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, తహసిల్దార్ విజయ ,ఎంపీడీవో ఎస్పీ జయలక్ష్మి, హౌసింగ్ డిఇ అబ్దుల్ వాజిద్ ,హౌసింగ్ ఏఈ ప్రీతి ,సర్పంచ్ కాటశీ వెంకటేశం,కార్యదర్శి గౌతం రెడ్డి, అధికారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు .



# కోళ్ల పడకల్ లో ఆది జాంబవంతుని గుడి పునర్నిర్మానం

మహేశ్వరం మార్చ్ 19 వార్త వేదిక సూర్య

రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం నియోజవర్గం పరిధిలోని కోళ్ల పడకల్ గ్రామంలో గురువారం మార్చి 19వ 2026తేదీన పరాభవ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొల్లపడకల్ గ్రామంలో 2004 లో ప్రతిష్టించబడిన ఆది జాంబవంతుని విగ్రహ ప్రతిష్ట మాత్రమే జరిగింది కావున మళ్లీ పునర్నిర్మాణంలో భాగంగా అదిజంవంతుని గుడి నిర్మాణానికి పూనుకొన్న మహేశ్వరం నియోజకవర్గంలో సరూర్నగర్,కందుకూరు,మహేశ్వరం బాలాపూర్ మండలాలకి సంబంధించిన, బడంగ్పేట్ మున్సిపాలిటీ కి నుంచి నాయకులు యువకులు ఈ కార్యక్రమంలో భాగంగానే గురూజీ మాల్యాద్రి , ఆధ్వర్యంలో మొక్కవోని ధైర్యంతో మాదిగల కుల దైవం అయినటువంటి అధి జంబవంతుని విగ్రహం గుడి పునఃప్రారంభం కోసం మాన్సన్పల్లి చౌరస్తా నుంచి కొల్లపడకల్ గ్రామంలో ఉన్నటువంటి జాంబవ గుట్ట మీద ఉన్నటువంటి ఆది జాంబవంతుని విగ్రహం వరకు దాదాపు 10 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని ఘనంగా పూజాకార్యక్రమాలు నిర్వహించడం జరిగింది మరియు ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో యోగా గురువు మాల్యాద్రి, ఆలయ నిర్మాణ కర్త బత్తుల సిద్దేశ్వర్ ,ఆలయ ఆధ్యక్షులు వత్తుల రఘుపతి ,పాండీ పెంటయ్య,

ఆది జాంబవంతుని ఆలయ కమిటీ చైర్మన్ గా హన్మగల్లా చంద్రయ్య,వైస్ చైర్మన్లుగా అందుగుల సత్యనారాయణ ,-పుట్టగల్ల జగన్ , ఆలయ జనరల్ సెక్రరీలుగా నందిగామ నరసింహ ,గుడ్ల శ్రీను ,ఆలయ ట్రెజరర్ గా చేపంగి ప్రవీణ్ , ఆలయ సాంస్కృతిక కార్యదర్శిగా కొమ్ము నరసింహ , ఆలయ జనరల్ సెక్రటరీలుగా క్యారగారి శ్రీధర్ ,నడ్డి నరసింహ ,హన్మగల్లా గణేష్ ,చేపంగి జంగయ్య ,కడిగాళ్ల శేఖర్, సోషల్ మీడియా ప్రచార కార్యదర్శిగా కట్టెల రాజశేఖర్ ,ఆలయ కార్యవర్గ సభ్యులుగా కడిగల్లా హిట్టలయ్య నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కప్పుల రాజు , కప్పల కరుణాకర్, తొండుపల్లె గిరి , పుట్టగల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ లోను వెంటనే పూర్తి చేసి అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలి

వార్తా వేదిక సూర్య :చిట్యాల మార్చి 19



గుండ్రాంపల్లి లో అసంపూర్తిగా నిర్మాణంలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ లోను వెంటనే పూర్తి చేసి అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కు మరియు ఎమ్మెల్యే వీరేశం కు వినతి పత్రం అందజేసిన బిజెపి సీనియర్ నాయకులు బోడిగె లక్ష్మయ్య గౌడ్ గుండ్రాంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్ర శేఖర్ కి, నకిరేకల్ఎమ్మెల్యే వేముల వీరేశం కి గుండ్రాంపల్లిలో అసంపూర్తి గా ఉన్నహౌడబుల్ బెడ్ రూమ్ లను పూర్తిచేసి అర్హులైన పేదలకు ఇవ్వగలరని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన డబుల్ బెడ్ రూమ పంపిణీ చేయకపోవడంతో పేద ప్రజలు తమ సొంత ఇంటి నిర్మాణం కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ల నిర్మాణం పేదలకు పంచాలని బిజెపి జిల్లా నాయకులు బొడిగె లక్ష్మయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పార్లపరచడానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కి మరియు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేషానికి వినతిపత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ బుస్సు నరసింహ. మాజీ వార్డ్ మెంబర్ బొడిగె అంజయ్య, జిల్లా ఓబీసీ మోర్చా నాయకులు పెద్దగోని అంజన్ కుమార్,దోర్నాల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి

## మల్లు స్వరాజ్యం జీవితం నేటి యువతకు ఆదర్శం

## పాలడుగు ప్రభావతి, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు




నల్లగొండ బ్యూరో, మార్చి 19 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి తెలిపారు. ఆమె నాల్గవ వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, “దున్నేవాడికే భూమి కావాలి”, “వెట్టి చాకిరి నిర్మూలించాలి” అనే లక్ష్యాలతో సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. అతి చిన్న వయస్సులోనే (సుమారు 13 ఏళ్ల వయసులో) ఉద్యమాల్లోకి ప్రవేశించి, మహిళల రక్షణ కోసం గెరిల్లా దళాలలో చేరి తుపాకి పట్టిన ధైర్యసాహసాల ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం సమయంలో నాటి సామంత వ్యవస్థ, జాగిర్దారీ విధానాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి పోరాటాలు నడిపారని తెలిపారు. ఈ ఉద్యమ ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచబడగా, వేలాది గ్రామాలు జాగిర్దారుల, దేశముఖుల ఆధీనంలోనుంచి విముక్తి పొందాయని వివరించారు. ఈ పోరాటంలో వేలాది మంది అమరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తుచేశారు. ఈ పోరాటాల ఫలితంగానే తెలంగాణలో భూ పంపిణీ జరిగి, పేదలు మరియు మహిళలకు కొంతమేర విముక్తి లభించిందని,

ఆ స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రభావతి పిలుపునిచ్చారు. ప్రస్తుత కాలంలో కూడా మహిళలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులతో సమాన కూలి అందకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ఇంకా వెట్టి చాకిరి కొనసాగడం, పని ప్రదేశాల్లో వేధింపులు, గృహహింస, అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు సంఘటితమై హక్కుల సాధన కోసం పెద్దఎత్తున ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

యువత ముఖ్యంగా యువతులు, యువకులు సామాజిక న్యాయం కోసం ముందుకు రావాలని, దోపిడీదారుల వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని సూచించారు. మల్లు స్వరాజ్యం వంటి మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ మేకల వర్ణ, ఐద్వా నాయకులు రమావత్ పార్వతి, లక్ష్మీ, నాగమణి, బబ్బి తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘనంగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా సంబరాలు..

దేవరకొండ మార్చి 19 ( వార్త వేదిక సూర్య ):-

జనసేన పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొత్త సినిమా ఉస్తాద్ భగత్ సింగ్ ఈరోజు విడుదల సందర్భంగా కొండమల్లేపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన పార్టీ నాయకులు దేవరకొండ థియేటర్ వద్దకి బైక్ ర్యాలీతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అభిమానులు. బావాండ్ల సాయి దండు రవికుమార్ మాట్లాడుతూ.పవన్ కళ్యాణ్ పేరు మీద ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసుకుంటూ ఆయన జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాలు అన్నదాన కార్యక్రమాలు ఎన్నో



నిర్వహించడం జరిగింది. రెండు చోట్ల ఓడిపోయిన అని కుంగిపోకుండా గట్టిగా నిలబడి మరొక్కసారి పోటీ చేసి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా ఎదిగాడు. ఇప్పుడు కార్యకర్తలకు అభిమానులకి జనసేన పార్టీ సభ్యత్వం తీసుకువచ్చి వాళ్ల కుటుంబాలకి అండగా నిలబడుతున్నాడు. దయచేసి ఇంకెవరైనా కార్యకర్తలు గాని అభిమానులు గాని జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వం తీసుకున్నట్లయితే కచ్చితంగా తీసుకోగలరని కోరుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా ఈ యొక్క సినిమాకి ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షక దేవుళ్ళకి మా పాదాభివందనాలని వాళ్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. వినోద్. కొండల్.. సతీష్. శ్రీకాంత్. రఘుపతి. ఆంజనేయులు. సైదులు. తదితరులు పాల్గొన్నారు

సంపుటి 1 సంచిక 293 వార్త వేదిక సూర్య || హైదరాబాద్ శుక్రవారం, మార్చి 20, 2026 ||

# పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

చౌటుప్పల్, ( వార్త వేదిక సూర్య )

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో గురువారం పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ ప్రసన్నాంజనేయం స్వామి దేవాలయం చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం లో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి మరియు భక్షాలు పులిహోర తీర్థ ప్రసాదాలు అందజేశారు. తదనంతరం పంచాంగ శ్రవణము మరియు హుండీ లెక్కింపు కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం హుండీల వేసిన రూపాయలను లెక్కింపు చేశారు. లెక్కింపు మొత్తము 33,395 రూపాయలు వచ్చినవి. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కానుగు శేఖర్ గౌర సలహాదారులు పాశం సంజయ్ బాబు దేవాలయ ధర్మకర్తలు పాశం రఘుపతి లందగిరి భీమయ్య ఆకుల ధర్మయ్య, లందగిరి వెంకటేశం గౌరవ అధ్యక్షులు మునుకుంట్ల మల్లేశం ఉపాధ్యక్షులు కుడుముల బసవ రెడ్డి ప్రధాన కార్యదర్శి మన్నెం శంకర్ ప్రజా ప్రతినిధులు 7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి మరియు 8వ వార్డు కౌన్సిలర్ బద్రి గాలయ్య వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాజీ సర్పంచ్ కానుగు యాదమ్మ బాలరాజు మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదుల్ పురోహితులు రాచకొండ భాస్కరాచారి కమిటీ సభ్యులు లందగిరి అరుణ్ కుమార్ కానుగు ప్రవీణ్ కానుగు శంకర్ లందగిరి సాయికుమార్ పర్సనబోయిన నరేష్ పెద్దిరెడ్డి శ్రీనువాస్ పాశం లింగస్వామి కానుగు సతీష్ లందగిరి వినయ్ కుమార్ గ్రామ పెద్దలు మరియు భక్తులు గడగోటి మల్లేశం గుండెబోయిన నరసింహ్మా పాశం కృష్ణయ్య గుండెబోయిన ఐలయ్య భీమనగొని శ్రీను సున్నపు మన్నెంకొండ లందగిరి యాదయ్య బత్తుల సత్తయ్య పాశం లక్ష్మయ్య నారగోని అంజయ్య మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీకి నేను కార్యదర్శిని కాదు ..కార్యదర్శి ఎన్నిక జరగలేదు ...దేవీజీ

**మావోయిస్టు పార్టీకి నేను కార్యదర్శిని కాదు ..కార్యదర్శి ఎన్నిక జరగలేదు ...తిపరి తిరుపతి**

**మేము లొంగిపోలేదు ...పోలీసులు అరెస్టు చేశారు**

**నంబాల మృతి కొందరి కుట్ర వల్లనే జరిగింది..అది పార్టీకి భారీ నష్టం**

**హిద్మా పోలీస్ కొరియర్ ద్రోహానికి బలైయ్యారు ..**

**మావోయిస్టు పార్టీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలి**

**జైల్లో ఉన్న మావోయిస్టులను, సానుభూతి పరులను విడుదల చేయాలి**

**మల్లోజుల , ఆశన్నలు పార్టీకి ద్రోహం చేశారు ...**

**వాళ్ళ వల్లనే లొంగుబాట్లు పెరిగి పార్టీ బలహీనపడింది ..**

**బలమైన లీగల్ పోరాటాల ద్వారానే పార్టీని బలోపేతం చేయాలి**

**తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు , రైతు చట్టాలపై జరిగిన పోరాటాలు స్ఫూర్తి**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)



మావోయిస్టు పార్టీలో నంబాల కేశవరావు మరణం తర్వాత కేంద్ర పార్టీ కార్యదర్శి ఎన్నిక జరగలేదని నేను పార్టీ కేంద్ర కార్యదర్శినని జరుగుతున్న ప్రచారం లో వాస్తవం లేదని, నేను కార్యదర్శిని కాదని కేవలం పొలిట్ బ్యూరో సభ్యుడనేనని తిపరి తిరుపతి అలియాస్ దేవీజీ అన్నారు. ఇటీవల ఆయన వివిధ మాధ్యమాల ద్వారా ఇస్తున్న ఇంటర్వ్యూలలో పార్టీ ఆలోచన విధానం తమ అరెస్టులు, లొంగుబాట్లు పై ఉన్న కన్ఫ్యూజన్ గురించి వివిధ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు ..నంబాల కేశవరావు మరణం కొందరు ద్రోహులు చేసిన కుట్ర వల్లనే జరిగిందన్నారు ..ఆయన మరణం పార్టీకి భారీ నష్టం చేసిందని అంగీకరించారు .. హిద్మ కొరియర్ వ్యవస్థను నమ్మి అరెస్ట్ అయి రెండు రోజుల చిత్రహింసలకు గురైయ్యారని అనంతరం కాల్చి చంపారని తెలిపారు ..తాను అనేక సార్లు హెచ్చరించానని ప్రతిసారి నన్నే కన్విన్స్ చేశాడని చివరకు శత్రువుల వలలో చిక్కుకున్నారని అన్నారు ..మావోయిస్ట్ పార్టీ , ఎల్పీజీ వేరు వేరని, పాలకులు రెండు ఒకటే అని అనుకుంటున్నారని దేవీజీ అన్నారు ..హిద్మ ఎల్పీజీలో కమాండర్ స్థాయికి ఎదిగారని చురుకైన వాడని అన్నారు ..ప్రజలకోసం పనిచేస్తున్నందునే ఆయనకు మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు ..

ఎక్కడెక్కడో ఉన్న పార్టీ కేంద్ర నాయకత్వాన్నిసంప్రదించి కేంద్ర కార్యదర్శిని ఎన్నుకోవాలని ఆలోచనలు చేస్తున్న తరుణంలోనే మల్లుజుల ఆశన్నలు పార్టీకి ద్రోహం చేశారని ఒకరకంగా శత్రువులతో చేతులు కలిపి ఆయుధాలతో సహా లొంగిపోయారని అన్నారు ..వారిని ద్రోహులుగా పార్టీ ప్రకటించడం జరిగిందన్నారు .వాళ్ళు లొంగిపోయిన పార్టీలో లొంగుబాట్లు పెరిగాయని అంగీకరించారు ...ఆపరేషన్ కగారు సందర్భంగా తాము చాలాకాలం కర్రెగుట్టల్లో ఉన్నామని తెలిపారు .శత్రువుల నిర్బంధం ఎక్కువైనా తర్వాత అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నామన్నారు . తిరిగి పరిస్థితులు కుదట పడిన తర్వాత కలుసుకోవాలని నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు .. తాను మూడు నెలల పాటు ములుగు ప్రాంతంలో ఉన్నానని అక్కడ నుంచి వేరే రాష్ట్రం వెళ్లేందుకు హైద్రాబాద్ చేరుకోగా పోలీసులు అరెస్టు చేశారని అన్నారు .. పోలీసులు చెపుతున్నట్లుగా తాము లొంగిపోలేదని అరెస్ట్ అయ్యామని స్పష్టం చేశారు ..

అరెస్ట్ అయినా సందర్భంగా సీఎం దగ్గరకు తీసుకోని వెళ్లారని అప్పుడు అక్కడ పార్టీపై ఉన్న నిషేధం ఎత్తివేయాలని జైల్లో ఉన్న మావోయిస్టులను సానుభూతిపరులను విడుదల చేయాలనీ డిమాండ్ చేశామని అన్నారు...సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని అయితే ఇది కేంద్రం తీసుకోవాల్సిన నిర్ణయం అయినందున కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తో మాట్లాడతానన్నారని ఆ దిశగా ఆయన వైపు నుంచి లోపం లేకుండా ప్రయత్నం చేశారని ఫలితం ఏమిటన్నది ఇంకా సమాచారం లేదని అన్నారు ..

పార్టీపై నిషేధం ఎత్తివేసి లీగల్ గా పనిచేసుకునేందుకు అవకాశం ఇస్తే ప్రజల దైనందిన దీర్ఘకాలిక సమస్యలపై పోరాటాలు చేస్తామని చెప్పారు .. ఇంకా సాయుధులుగా ఉన్నవారిని సైతం లొంగిపోయి ఆయుధాలు అప్పగించేలా కృషి చేస్తామని అన్నారు ... తాము కాంగ్రెస్ లో చేరుతున్నామని లేదా ఇతర పార్టీల్లో చేరబోతున్నారని వస్తున్న వార్తలు కేవలం కల్పితాలని అన్నారు .. తాము అధికార పార్టీలో చేరి ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా పోటీచేయబోతున్నామని జరుగుతున్న ప్రచారం కేవలం మీడియా కల్పితాలేనని కొట్టి పారేశారు ...తాము కోట్లాది మంది ప్రజలకోసం ప్రాణాలు సైతం లెక్కచేయక నిలబడ్డామని పేదల కోసం జనతన సర్కార్ నడిపామని , అయితే అప్పుడు సాయుధులుగా ఉన్నామని, ఇప్పుడు అవకాశం ఇస్తే చట్ట పరిధిలో ప్రజల పక్షాన పోరాడతామని అన్నారు .. బలమైన ఉద్యమాల ద్వారానే పార్టీని అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, కిసాన్ ఉద్యమాలు తరహాలో ప్రజల కోసం పనిచేస్తామని అందుకోసం అవసరమైతే జైళ్లకు వెళ్లడానికైనా సిద్ధమేనని తిరుపతి అన్నారు ..ఉద్యమాల్లో అమరులైన మావోయిస్టు కుటుంబాలను కలవాలని నిర్ణయించుకున్నామని వారికీ అండగా మేము ఉన్నామనే భరోసా , వారికీ అవసరమైన ఆర్ధిక సహాయం కూడా దాతలను నుంచి సేకరించి ఇస్తామని తెలిపారు .. మల్లోజుల ఆశన్నలను కూడా మీ పోరాటాల్లో కలుపుకుంటారా ..?అనే ప్రశ్నకు వారు బహిరంగంగా తమతప్పును అంగీకరిస్తే ఆలోచిస్తామని తిరుపతి అన్నారు ..

## 18 పాల్వంచ మండల పరిధిలోని తోగ్గూడెంలో అక్రమ మైనింగ్ వ్యవహారంపై

# విచారణ జరపాలి

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు



పాల్వంచ, ( వార్త వేదిక సూర్య )

భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ రోజు పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 క్వారీలు మరియు 7 నుండి 8 క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ క్వారీలు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుండి అనుమతులు పొంది కొందరు దళారులు వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ అంశంపై భారతీయ జనతా పార్టీ గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో గనుల శాఖ నిర్వహించిన జూా సర్వేలో తోగ్గూడెం ప్రాంతంలో సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమ తవ్వకాలు జరిగినట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. మైన్స్ అండ్ జియాలజీ శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం తోగ్గూడెం ప్రాంతంలోని పలువురు క్వారీ లీజ్ హోల్డర్లపై ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఈ భారీ జరిమానాలను చెల్లించకుండా కొన్ని క్వారీలు రోజువారీగా అక్రమంగా తవ్వకాలు కొనసాగిస్తూ క్రషింగ్ మిల్లులు నడుపుతున్నాయని ఆయన విమర్శించారు. సంవత్సరాలుగా అక్రమంగా ఖనిజాన్ని తవ్వడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని తెలిపారు. అక్రమంగా తవ్విన ఖనిజాలపై సెయినియరేజ్ ఫీజు మరియు భారీ పెనాల్టీలు విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవడం ఆశ్చకరమని అన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందో ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు.

తోగ్గూడెం ప్రాంతంలో అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మరియు మైన్స్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని, ఇన్ని సంవత్సరాలుగా కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం అక్రమంగా నడుస్తున్న క్వారీలు మరియు క్రషింగ్ మిల్లుల అనుమతులను రద్దు చేసి ప్రజల అవసరాల నిమిత్తం ఆ ప్రాంత గిరిజనులకే కొత్త అనుమతులు ఇచ్చి మైనింగ్ నిబంధనల ప్రకారం కంకర సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రూ.300 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

దీనివల్ల ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఎంతవరకు ఉందో ప్రజలకు అర్థమవుతోందని అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. అలాగే ఈ కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (జుఐ) మరియు ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడమే కాకుండా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (గాxూ) కూడా దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నోముల రమేష్,గోడుగు శ్రీధర్ యాదవ్,శీలం విద్యాసాగర్ (కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు),కాల్వ ప్రసాద్,శ్రీనివాస్, మాదారపు లక్ష్మణ్,లింగగిరి వెంకట్రామయ్య ,భూక్య మోహన్, భూక్య ఆశ,కోటేశ్వరావు,పవన్,కొత్తపల్లి విజయ్,బానోత్ బాలాజీ లు పాల్గొన్నారు.

## 29ఉగాది పురస్కారాలు పోస్టర్ ఆవిష్కరించిన

# మేయర్ కొలాగాని శ్రీనివాస్

కరీంనగర్:( వార్త వేదిక సూర్య )

తెలంగాణ చేనేత ఐక్యవేదిక, పద్మశాలి వ్యాపార నెట్ వర్క సంయుక్తంగా నిర్వహిస్తున్న హ్యాండ్లూమ్ ఎక్స్పో 2026,పద్మశాలి ఉగాది పురస్కారాలు పోస్టర్ ను కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కోలగాని శ్రీనివాస్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీర మోహన్ మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో హైదరాబాద్ ఎల్బీనగర్ లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్ హ్యాండ్లూమ్ ఎక్స్పో 2026 పద్మశాలి ఉగాది పురస్కారాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పద్మశాలి ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు, కళాకారులకు, వ్యాపార సామాజిక రంగాలకు చెందిన ప్రతిభావంతులకు తెలుగు సంవత్సరాది ఉగాది పురస్కారాలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ హ్యాండ్లూమ్ ఎక్స్పోలో చేనేత వస్త్ర ప్రదర్శనతో పాటు విభిన్న రకాల ప్రదర్శనలు, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ఆటపాటలు నిర్వహించబడతాయని అన్నారు. అలాగే వివిధ వ్యాపారులు తమ తమ ఉత్పత్తులను ఇందులో ప్రదర్శన చేసుకొని విక్రయాలు చేసుకోవడానికి ఈ ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వివిధ చేనేత ఉత్పత్తుల ప్రదర్శన కోసం స్టాల్స్ ఏర్పాటు చేసుకొనుటకు కమిటీ వారిని సంప్రదించాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు చొరవ తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం మేయర్ తో పాటు నూతనంగా ఎన్నికైన పద్మశాలి కార్పొరేటర్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలిగేటి శ్రీనివాస్, కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవితా చంద్రశేఖర్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, మాసం గణేష్, బండ రమణా, సోమిడి వేణు, కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం కోశాధికారి గజవెల్లి కనకయ్య, పోపా ఉపాధ్యక్షులు పిస్క లక్ష్మీనారాయణ, గాజుల భగవాన్,భీమనాథని శారద, సిరిసిల్ల సురేష్, ఆడపు మునిధర్, కొక్కుల గోవర్ధన్ మంచాల మోహన్, పద్మశాలి కుల నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఎస్సై భార్య ఆత్మహత్య

కరీంనగర్:( వార్త వేదిక సూర్య )

కరీంనగర్ టూ టౌన్ లో ఎస్సైగా పని చేస్తున్న చంద్ర శేఖర్ భార్య ఆత్మహత్యకు పాల్పడ్డారు. గన్నేరుపప్పు దంచుకుని తిన్న ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మరణించారు. సంఘటనా వివరాల్లోకి వెళ్తే... కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో నివాసం ఉంటున్న చంద్ర శేఖర్ భార్య దివ్య మంగళవారం ఇంట్లో గన్నేరు పప్పు దంచి తిన్నడంతో ఆరోగ్యం విషమించింది. విషపూరితమైన గన్నేరు పప్పు తినడంతో తీవ్ర అస్వస్థకు గురైన దివ్యను కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స అందించి హైదరాబాద్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మరణించారు. దివ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావల్సి ఉంది. చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు అబ్బాయిలు సంతానం కాగా వీరు ఏడేళ్ల వయసు వరకు ఉంటుంది. చిరు ప్రాయంలోనే తల్లిని కోల్పోయిన ఆ బిడ్డలను చూసి స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



# 19డ్వాక్రా మహిళా సంఘాల డబ్బులు స్వాహా చేసిన గ్రామ దీపిక

వైరా, ( వార్త వేదిక సూర్య )

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలో డ్వాక్రా మహిళా సంఘాల గ్రూపు సభ్యుల వద్ద నుండి డబ్బులు వసూలు చేసి బ్యాంకుకు చెల్లించకుండా గ్రామ దీపిక సొంత అవసరాలకు వాడుకుంది. గ్రామ దీపిక పరిధిలో సుమారు 15 డ్వాక్రా సంఘాలు వున్నాయి. గ్రామ దీపిక ఆదూరి సమాధానం ను మహిళా సంఘాల సభ్యులు నిలదీసారు. శ్రీనిధి డబ్బులు సొంత అవసరాలకు గ్రామదీపిక వాడుకుందని ఆరోపించారు. ఓ మహిళా సంఘం సభ్యులు బ్యాంకుకు వెళ్లి స్టేట్మెంట్ తీసుకోవడంతో భాగోతం బయటపడింది. గ్రామ దీపిక మోసం చేసిందని స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారు.

# 26అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనం

హన్మకొండ, ( వార్త వేదిక సూర్య )

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో అనుమానాస్పద రీతిలో తండ్రి, కుమార్తె సజీవ దహనం అయ్యారు. మృతులు తండ్రి రాజ శేఖర్ (54), కుమార్తె రాజశ్రీ (24)గా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా అల్లుడు ప్రవీణ్ వారిద్దరినీ చంపినట్లు సమాచారం. సమాచారం అందుకున్న మడి కొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ అక్కడికి చేరుకుని పరిశీ లించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను పోలీసులు సేకరించారు.ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# 27యూపీఐ ద్వారా రూ.14 లక్షల 77 వేల లంచం

## ఏసీబీ వలలో సూపరింటెండెంట్

కరీంనగర్, ( వార్త వేదిక సూర్య )

పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుంటున్న కరీంనగర్ జాయింట్ డైరెక్టర్ వర్క్స అకౌంట్స్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఈగల మధుసూధన్ ఏసీబీకి దొరికిపోయాడు. సంవత్సర కాలంలో రూ.14,77,003 లంచాలుగా యూపిఐ ద్వారా తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించారు. భద్రాద్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్లోని ఒక బినామీ ఖాతాను ఉపయోగించి ఈ లంచాలు తీసుకున్నట్లు నిర్ధారించారు.

# 33బిజెపి కార్యకర్తలపై దాడి చేస్తే ఖబడ్దార్

నల్గొండ, ( వార్త వేదిక సూర్య )

రాష్ట్రంలో అధికార పార్టీ నేతల ఆగడాలు మితిమీరిపోయాయి. చండూరు లో బీజేపీ నేతల్ని చంపడానికి ప్రయత్నించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థిగా ఉన్నందుకే మా కార్యకర్తపై దాడికి తెగబడ్డారు. ఖాకీలు కూడా కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. బిజెపి కార్యకర్తలపై దాడి చేస్తే ఖబడ్దార్. లిక్కర్,డ్రగ్స్,భూ దందాలు మొత్తం కాంగ్రెస్ నేతలే నడిపిస్తున్నారని అయన ఆరోపించారు.

# మట్టి పాత్రలను వాడండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి

### ఉగాది పండుగను మట్టి పాత్రలతో జరుపుకుని కుల వృత్తిని ప్రోత్సహించండి

### తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)



శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని పురస్కరించుకొని "మట్టి పాత్రలు వాడండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి ,కుల వృత్తులను ప్రోత్సహించండి" నినాదంతో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి ఉగాది మట్టి పాత్రల కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడడానికి ,కుల వృత్తులను కాపాడడానికి ఆరోగ్యాలను కాపాడుకోవడానికి మట్టి పాత్రలు మంచివని తెలిపారు. అందజేశారు. మట్టి పాత్రలు వాడకం తరతరాల సంప్రదాయమని , దీని వల్ల ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని, ఉగాది పండుగ సందర్భంగా మట్టి పాత్రలు వాడండి కుల వృత్తులను కాపాడండి .. ఆరోగ్యాన్ని రక్షించుకోండి అని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా రంజాన్ పండుగకు ఏర్పాట్లు



**చౌటుప్పల్ మార్చి 19 (వార్తా వేదిక సూర్య ) :** మున్సిపాలిటీ పరిధిలోని శనివారం జరగబోయే రంజాన్ పండుగ సందర్భంగా గురువారం చౌటుప్పల 20వ వార్డు కౌన్సిలర్ హన్ను భాయ్ దర్గా అధ్యక్షులు ఎండి బాబా షరీఫ్ లు కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పనులు వేగవంతం జరిగేలా చూడాలని ముస్లింలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కార్యదర్శి నఫీస్ చోటే బాయ్ మమ్మది యామసీద్ అధ్యక్షుడు బాబ్జాని మరియు కమిటీ నెంబర్లు సఫైర్ ముషీర్ రఫీ నయీమ్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పంచాంగం అందజేత



**యాదాద్రి భువనగిరి/మార్చి 19 వార్త వేధిక సూర్య :** శ్రీ పరభావ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలేరు పట్టణానికి చెందిన, సీనియర్ పాత్రికేయుడు, టీయూడబ్ల్యూజే యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా సాక్షి పత్రికా స్టాపర్ యంబ నరసింహులు దంపతులకు గురువారం వారి నివాసంలో ఐవిఎఫ్ రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ వంగపల్లి అంజయ్య స్వామి దంపతులు వారిని శాలువాతో సత్కరించి, పార్వతీ పరమేశ్వరుల లక్ష రుద్రాక్ష పూజలోని, ఐదు రుద్రాక్షలతో పాటు, నూతన పంచాంగాన్ని అందజేసి, శ్రీ పరభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేసిన బర్రె పూజిత కౌన్సిలర్- జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్



**భువనగిరి/మార్చి 19 వార్త వేధిక సూర్య :** మున్సిపల్ పట్టణ పరిధిలోని 23వ వార్డు ఇందిరానగర్ కీ చెందిన పల్లె పద్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత- జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మృతి చెందిన సభ్యులను పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంతక్రియలకు కుటుంబ సభ్యులకు మానవ దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట వార్డు ప్రజలు, పలువురు ఉన్నారు.వార్డ్ నాయకులు బండారు రవి వర్ధన్, గోపి బాబు, బర్రె క్రాంతి, కసరబోయిన సాయికుమార్, భూషపాక యాదగిరి తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## మణికంఠ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ రణమల్ల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా రంజాన్ తోఫా పంపిణీ



**గుండాల ,19 మార్చి (వార్తవేదిక సూర్య) :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పరిధిలోని పెద్దపాతశాల గ్రామంలో ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మణికంఠ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ రణమల్ల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా రంజాన్ తోఫాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రంజాన్ పండుగ అనేది పరస్పర ప్రేమ, సౌహార్ద్రం, సహనానికి ప్రతీక అని తెలిపారు. మతభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా జీవించడం మన సమాజానికి ఎంతో అవసరమని, ఇలాంటి పండుగలు మనుషుల మధ్య బంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. పేద మరియు అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. గ్రామంలోని ముస్లిం సోదరులు ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ తోఫాలలో అవసరమైన ఆహార పదార్థాలు అందించడం వల్ల తమకు ఎంతో ఉపశమనం కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మణికంఠ ఫౌండేషన్ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. చివరగా సమాజంలో ఐక్యత, శాంతి నెలకొనాలని కోరుతూ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాకుబ్, యూసుఫ్, హైమద్,మైబు,మౌలానా,జానీ,షఫియా,తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా






**భువనగిరి రూరల్ , మార్చి 19/వార్త వేధిక సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారి సొంత నిధులతో పేద ముస్లిం మైనారిటీ కు టుంబాలకు రంజాన్ తోఫా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పేద 120ముస్లిం కుటుంబాలు ఎక్కువగా ఉండటం వల్ల వారు పండుగ రోజు సంతోషంగా ఉండాలని కోరు కుంటూ వారి కుటుంబాలకు తోఫా అందించడం జరిగింది అన్నారు. అదేవిధంగా గ్రామంలో ఏ వర్గాల వారికైనా ఆపద వస్తే వారి వెన్నంటే ఉ ంటూ ఆ బాధను వారి భుజాలపై మోస్తూ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉంటానని వారు తెలిపారు. డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లా డుతూ గత మూడు సం వత్సరాల నుండి గ్రావ ంలో పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలకు వారి సొంత నిధులతో ఈ రంజాన్ తోఫాను అందిస్తున్నామని తెలుపుతూ గతంలో బిఆర్ఎస్ హయంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టే వారిని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రంజాన్ తోఫా గ్రామంలో ఒక్కరికి కూడా అందలేదని వారు విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడుస్తూ ఈ ముస్లిం కుటుంబాలకు ఈ రంజాన్ తోఫా అందిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడానికి కనిపించే ముస్లింలు రంజాన్ తోఫా అంది ంచడానికి కనిపించరా అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో గల ముస్లిం మహిళ ఆమె భర్త చనిపోయిన తర్వాత తనకి ఉ ండడానికి ఇల్లు కూడా లేదని గమనించి వారికి సొంత నిధులతో దాదాపు లక్ష రూపాయలతో ఒక గృహాన్ని నిర్మించి రంజాన్ రోజు గృహప్రవేశం నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. గ్రామంలో ముస్లిం సోదరులకే కాకుండా హిందు వులు అయినా ఇతర ఏ వర్గాల ప్రజలకైన ఎటువంటి సహాయానికైనా వారు ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మీ బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు మాజీ వార్డు మెంబర్స్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ముస్లిం నాయకులు, ముస్లిం మైనారిటీ సోదరులు, మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం పంచాంగ శ్రవణం

**చౌటుప్పల్ మార్చి 19 (వార్తా వేదిక సూర్య ) :** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం భవాని నగర్ చౌటుప్పల్ లో పంచాంగ శ్రవణం కార్యక్రమం మరియు భక్తులకు ఉగాది పచ్చడి భక్షాల వితరణ కార్యక్రమం ఘనంగా గురువారం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా ఉగాది పచ్చడి వితరణ నిర్వహించారు. అనంతరం వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 12 ఫలితాలు, దేశ రాష్ట్ర పరిస్థితులను ఈ సంవత్సరం పంచాంగం ప్రకారం జరిగే మంచి చెడులను కూలం కుషంగా వివరించి తెలియజేశారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడతాయని దేశంలోని రైతులు వృద్ధి సాధిస్తారని తెలియ





జేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేష్ వరకల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, చౌటుప్పల్ పురపాలక కౌన్సిలర్లు బత్తుల వాణి విప్లవ గౌడ్, దీప రమ్యరాజు, ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బత్తుల జయలక్ష్మి దాసు గౌడ్, మంచి కంటికి భాస్కర్ గుప్తా, బుడిగే బాలకృష్ణ గౌడ్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, ఉడుగు మల్లేష్ గౌడ్ చింతల తిరుమలరెడ్డి, బొబ్బిళ్ళ రాజేందర్, చెరుకు లింగస్వామి గౌడ్, గోశిక రవి, గంగరాములు, చెవ్వగోనివెంకటేష్ గౌడ్, జక్కర్తి శేఖర్, పెద్దగోని రమేష్ గౌడ్, ముద్దం సత్తయ్య గౌడ,కర్నాటి శ్యామ్, ఉప్పల కృష్ణ గుప్తా, సంగమేశ్వర్, రాజేష్ గౌడ్, ఒరగంటి మహేందర్ గౌడ్, మునుకుంట్ల జంగయ్య గౌడ్, వీరమల్ల యాదయ్య గౌడ్, ఆంజనేయ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది కాటమయ్య బోనాల పండుగ

**గ్రామదేవతలకు మొక్కులు సమర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు..**



**గుండాల,మార్చి 19 (వార్తవేదిక సూర్య) :** గురువారం సుద్దాల ఉగాది కాటమయ్య బోనాల పండుగ సందర్భంగా గ్రామదేవతలకు మొక్కులు సమర్పిస్తూ గౌడ సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించిన వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ పండుగను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం గ్రామ ప్రజల ఆనవాయితీగా కొనసాగుతోంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కాటమ య్య స్వామి మరియు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలుస్తోంది. పండుగకు ముందు రోజు నుంచే గ్రామంలో సందడి మొదలైంది. గౌడ సంఘం సభ్యులు, యువకులు కలిసి దేవాలయ పరిసరాలను శుభ్రపరిచి అలం కరించారు. రంగురంగుల తోరణాలు, పూల దండలు, దీపాలతో ఆలయాన్ని అలంకరి ంచి పండుగకు సిద్ధం చేశారు. మహిళలు స ంప్రదాయబద్ధంగా బోనాలను సిద్ధం చేసి, పసు పు, కుంకుమతో అలంకరించి భక్తితో తలపై మోసుకొచ్చారు. గ్రామంలో ఊరేగింపుగా బోనా లను తీసుకువెళ్తూ హారతులు ఇస్తూ, జైజై కారాలతో దేవాలయానికి చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు గ్రామదే వతలకు మొక్కులు సమర్పిస్తూ గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. మంచి వర్షాలు కురవాలని, పంటలు పుష్కలంగా పండా లని, ప్రతి ఇంట్లో ఆనందం నిండాలని కోరుకు న్నారు. గ్రామంలో శాంతి, ఐక్యత నెలకొని ప్రజ లు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించా రు. కాటమయ్య స్వామి ఆశీస్సులు గ్రామానికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ ప్రత్యేక అర్చన లు నిర్వహించారు. పండుగలో భాగంగా పూజా రులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందారు. కొంద రు భక్తులు తమ కుటుంబ సమస్యలు తొల గాలని, కోరికలు నెరవేరాలని మొక్కులు పెట్టుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడు తూ, ఇటువంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఎంతో ముఖ్య మైనవని తెలిపారు. గౌడ సంఘం సభ్యులు ప్రతి సంవత్సరం ఈ పండుగను ఇంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి పండు గను ఆనందంగా జరుపుకోవడం గ్రామంలో ఐక్యతను మరింత బలపరిచింది. చివరగా గ్రామ ప్రజలంతా కలిసి దేవతలకు హారతులు ఇస్తూ పండుగను విజయవంతంగా పూజలు అందిస్తున్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో చలివేంద్రం- ఉగాది పచ్చడి, పంపిణీ

**చౌటుప్పల మున్సిపల్ చైర్మన్.మోగుదాల పావని రమేష్, సీఐ మన్మధ కుమార్**

**చౌటుప్పల్ మార్చి 19 (వార్తా వేదిక సూర్య ) :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ ఆధ్వర్యంలో స్వర్గీయ చింతల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కు మారుడు చింతల ప్రభాకర్ రెడ్డి -శ్వేత దం పతుల సౌజన్యంతో ఉగాది గురువారం రోజున చౌగురువారంమున్సిపాలిటీలోని పోలీస్ స్టేషన్ ముందర చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మో గుదాల పావని -రమేష్ ,మరియు సీఐ మన్మధ కుమార్ లు కలిసి రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం, ప్రారంభించారు. అనంతరం ఉగాది పచ్చడి ని పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ఉగాది దినం అనునది సృష్టి ఆదికి, జగతి పుట్టుకకు గుర్తు. ఉగాది రోజున, మనలోనున్న ఆరు జతల గుణములకు ప్రతీకగా, ఆరు రుచులున్న చెట్ల పూతల పచ్చడిని సేవించడం వల్ల జీర్ణాశయంలోని జటాగ్నిలో కాల్చివేసినట్లు, ఆరు జతల గుణముల కర్మలను, తలలోని జ్ఞానాగ్నితో కాల్చివేస్తాయని అన్నారు.






షడ్రు రూచుల సమ్మేళ నమైన ఉగాది పచ్చడిలాగే, జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, జయ అపజయాలను స్వీకరిస్తూ, ఈ కొత్త సంవత్సరంలో, కొత్త ఆలో చనలతోటి, కొత్త కొత్త విజయాలు సాధిం చాలని, ఈ ఉగాది మీ జీవితంలో కొత్త వెలు గులు నింపే ఆరంభం కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్ పాక చిరంజీవి, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాసచారి, ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్, కార్యదర్శి మోగుదాల రమేష్, కోశాధికారి గోశిక కరుణాకర్, క్లబ్బు అధ్యక్షులు తిరందాసు జగన్నాథ్, కార్యదర్శి అతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, ఉప్పు ఆంజనేయులు, కాసుల వెంకటేశం, కటకం ప్రశాంత్, చింతల ప్రభాకర్ రెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, గోపగోని లక్ష్మణ్, దాచేపల్లి శ్రీనివాస్, వేముల నరసింహ, చింతల తిరుమలరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ చారి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 293
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
శుక్రవారం,
మార్చి 20, 2026

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి రామ్ మందిర్‌లో ఉగాది సంబురాలు

- ఉగాది వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా చైతన్య రెడ్డి, భరత్ సాయు రెడ్డి
- గత కొన్ని దశబ్దాలుగా రామ్ మందిర్‌లో పేలాల లడ్డూ ప్రసాదం విసిరే ఆచారం
- పేలాల లడ్డు ప్రసాదం కోసం రామ్ మందిర్‌కు తరలి వచ్చిన వేలాది భక్తులు
- భజనలు, భక్తి గీతాలు, ఉట్టి కొట్టడం, లడ్డూ ప్రసాద వితరణ కార్యక్రమాలతో సందడిగా ఉగాది వేడుకలు



**సంగారెడ్డి,మార్చి 19 (వార్త వేదిక సూర్య) :** ప్రతీ ఏడూ మాదిరిగా ఈ ఏడాది రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు అంబరాన్ని అంటాయి. టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో రామ్ నగర్ రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గారెడ్డి స్వయంగా పాటలు పాడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ భజన లో పాల్గొన్నారు. పేలాల లడ్డు ప్రసాదం తో భజన కీర్తనలు పాడుతూ రామ్ నగర్ లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామ్ మందిర్ లో శ్రీ కృష్ణ భగవానుడి ఉట్టి కొట్టడం నిర్వహించారు. అనంతరం తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం రామ్ మందిర్ పై నుండి పేలాల లడ్డూ ప్రసాదాన్ని భక్తుల పైకి విసిరే శారు. ఉగాది రోజు ఈ లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటే అదృష్టం వరిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ ప్రసాదాన్ని అందుకోవడానికి వేలాది మంది భక్తులు రామ్ మందిర్ కు చేరుకుని ప్రసాదాన్ని అందుకోవడానికి పోటీలు పడ్డారు. ఈ కార్యక్రమం లో టీజీఐఐసి నిర్మలా జగ్గారెడ్డి తో పాటు జగ్గారెడ్డి కూతురు జయా చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయి రెడ్డి లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గోపరాజుపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు



**వలిగొండ, మార్చి 19(వార్తా వేదిక సూర్య) :** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామంలో ప్రజలు ఘనంగానిర్వహించారు .ఆంజనేయస్వామి దేవాలయంలో అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి భక్తులకి అందించారు. పురోహితులచే పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలిగంజి పృథ్వీ,ఉప సర్పంచ్ పోలబోయిన లింగస్వామి, వార్డ్ మెంబర్లు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 108లో ప్రసవం.. తల్లి బిడ్డలు క్షేమం



**మోత్కూరు, (అడ్డగూడూరు) మార్చి 19 (వార్త వేధిక సూర్య ) :** అడ్డగూడూరు మండలంలోని చిర్ర గూడూరు గ్రామానికి చెందిన కడియం మనీషా కు రెండో కాన్పు పురిటి నొప్పులు అధికమవ్వడంతో గురువారం 108 అంబులెన్స్ కు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారాన్ని అందుకున్న గుండాల 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో నార్కట్ పల్లి మండలం అక్కే నపల్లి గ్రామానికి చేరుకోగానే పురి టి నొప్పులు ఎక్కువ కావడంతో 108 మెడికల్ టెక్నిషియన్ యాకస్వామి, ఆశా వర్కర్ కడియం సుమన పైలెట్ నరేష్ లు సమయ–స్ఫూర్తితో నార్మల్ డెలివరీ చేయడంతో పండంటి ఆడబిడ్డ కు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని , తదుపరి మెరుగైన చికిత్స కోసం కామినేని ఆసుపత్రిలో చేర్పించామని 108 సిబ్బంది తెలిపారు. మనీషా చికిత్సకు సంపూర్ణ సహకారాలు అందించిన 108 సిబ్బంది కి మనిషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట మార్చి 19 (వార్త వేదిక సూర్య ) :** పట్టణంలోని బీర్ల నిలయం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే తొలుత స్వామి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన కాలమాన సూచిక అయిన పంచాంగానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిద్ధాంతులు ఈ ఏడాది ఫలితాలను, ఆదాయ వ్యయాలను వివరించగా ఆయన ఆసక్తిగా విన్నారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ 'పరాభవ' నామ సంవత్సరం లేదా ప్రస్తుత సంవత్సర నామం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని, నియోజకవర్గ,జిల్లా రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో నూతన సంవత్సరం సందర్భంగా దేవస్థానం అధికారులు భక్తిశ్రద్ధలతో పంచాంగాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య కి యాదగిరిగుట్ట దేవస్థానం వారు నూతన సంవత్సర పంచాంగాన్ని అందజేసి ఆశీర్వచనం అందించారు.

## మహేశ్వరంలో ఉగాది పంచాంగ శ్రవణం

**మహేశ్వరం, మార్చి 19 (వార్త వేధిక సూర్య ):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా మహేశ్వరం గ్రామంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, పెద్దల ఆధ్వర్యంలో శ్రీ కటేపల్లి శ్యాం సుందర్ శర్మ పంతులు, మడుపతి మణికంఠ పంతులు చే పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.. శ్యాం పంతులు, పంచాంగం గురించి వివరిస్తూ ఇది ఈ సంవత్సరంలో గ్రహ స్థితులు, రాశి ఫలాలు, వర్షం, పంటలు, రాజకీయ పరిస్థితులు వంటి శుభాశుభాలను తెలుపుతుందని.

ఈ శ్రవణం వినడం వల్ల శుభం, ఆయుర్వృద్ధి కలుగుతాయని నమ్మకమని, ఇది భగవదనుగ్రహ కారకం అన్నారు. ఈ కార్యక్రమంలో పోతర్ల అంబయ్య యాదవ్, శివ మూర్తి, అల్లే కుమార్, స్వర్ణగంటి ఆనందం, పోతర్ల సుదర్శన్ యాదవ్, నిమ్మగూడం సుదీర్, కాకి కుమార్, కాడమోని ప్రభాకర్, మక్కాజి, చంద్రమౌళి, భిక్షపతి, బాలయ్య, అంజప్ప, కృష్ణ యాదవ్, కటికల మహేందర్, తెల్జీరి శ్రీశైలం, మిద్దింది బాలరాజ్, కర్రోళ్ల శ్రీనివాస్, దూసగంటి మహేందర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.





# మోత్కూరులో వినూత్న రీతిలో ఉగాది వేడుకలు

▸▸ బోనాలు బైక్ విన్యాసాలు ఎడ్ల ప్రదర్శనలు
అంబరాలన్నాంటిన ఉగాది సంబరాలు

**మోత్కూరు, మార్చి 19 (వార్త వేదిక సూర్య ):** ఉగాది పండగ అనగానే షడుచులతో కూడిన ఉగాది పచ్చడి , మామిడి తోరణాలు, పంచాంగం శ్రవణం గుర్తుకొస్తాయి. కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు మున్సిపాలిటీ లో మాత్రం ఉగాది పండుగను అందు కు భిన్నంగా ప్రత్యేకంగా జరుపుకుంటారు. తెలుగు రాష్ట్రా ల్లోనే ఎక్కడ లేని విధంగా ఇక్కడి ప్రజలు తూర్పు ము త్యాలమ్మ ,పడమటి ముత్యాలమ్మ లకు బోనాలతో నైవేద్యం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోనాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన , యువకులు బైక్ విన్యాసాలు, ఎడ్లబండ్ల ప్రదర్శన, ట్రాక్టర్లు వివైత వాహనాలతో ఆ పాఠశాల ప్రాంగణమంతా ప్రదర్శనలు చేస్తారు.

### ఈ సాంప్రదాయం ఏలా వచ్చిందంటే......

సుమారు వందేళ్ళ పైగా ఇక్కడ ప్రజలకు కలరా మసూచి వచ్చి సకాలంలో ఆ వ్యాధులు తగ్గకపోవడం , ఈ వ్యాధులు వ్యాపించి ఎక్కువగా మరణాలు చోటు చే సుకోవడంతో అప్పటి పెద్ద మనుషులు ముత్యాలమ్మ దేవతకు శాంతి నెలకొలపాలని ఉగాది వేడుకలకు బోనాలు సమర్పించడంతో ఆ వ్యాధులు తగ్గుముఖం పట్టడంతో ఆనాటి నుండి నేటి వరకు బోనాలు, బైక్ లతో విన్యాసాలతో , ఎడ్లబండ్ల ప్రదర్శనలు నిర్వహిస్తూ వస్తున్నారు.

### ముత్యాలమ్మ కు పట్టు వస్త్రాలను సమర్పణ.

ఉగాది వేడుకలలో భాగంగా గురువారం స్థానిక రిటైర్ ప్రధానోపాధ్యాయులు కల్వల ప్రకాష్ రాయుడు ఇంటి సమీపం నుండి పడమటి ముత్యాలమ్మ, తూర్పు ముత్యాలమ్మ దేవతలకు డప్పు చప్పులతో పుర ప్రముఖులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం మహిళలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకొని అక్కడ కొద్దిసేపు ఆటపాటతో అలంకరించారు. బోనాల చుట్టూ యువకులు ఎడ్లబండ్ల ప్రదర్శన బైక్ విన్యాసాలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుండి తూర్పు, ముత్యాలమ్మ దేవతకు బోనాలు, నూతన వస్త్రాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.



### శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం.

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానికరం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగం శ్రవణం నిర్వహించారు. అనంతరం కల్వల సుధాకర్ ఇంటిలో పంచాంగం శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న, వార్డు కౌన్సిలర్లు కురిమిళ్ళ ప్రమీల, పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, పుర ప్రముఖులు కల్వల ప్రకాష్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, రాయుడు, గుండగోని రామచంద్రు గౌడ్, బొల్లెపల్లి వెంకటయ్య, బయ్యని రాజు, జంగ శ్రీను పురుగుల మల్లయ్య , మర్రి ఆనందం , కూరెళ్ళ వీర పెద్దులు, గంగులు, పురుగుల వెంకన్న, నిలిగొండ హరీష్ కోటయ్య పాల్గొన్నారు.








## డిసిసి కార్యదర్శిగా అవిలిమల్లు నియామకం




**మోత్కూరు, మార్చి 19 (వార్తా వేదిక సూర్య ):** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా మోత్కూరు పట్టణానికి చెందిన అవిశెట్టి అవిలిమల్లు ను నియమిస్తూ డిసిసి అధ్యక్షులు , ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అవిలిమల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గత 7 ఏళ్లుగా క్రమశిక్షణ సైనికునిగా పనిచేస్తున్న పనితీరును గుర్తించి తనను జిల్లా పార్టీ కార్యదర్శిగా నియమించారని అన్నారు. ఈ నియామకంతో కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలో పతానికి కృషి చేస్తానన్నారు తన నియమాకానికి సహకరించిన డిసిసి అధ్యక్షులు బీర్ల అయిలయ్య, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ నియామకం



**మోత్కూరు, మార్చి 19 (వార్త వేదిక సూర్య) :** జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా మండలంలోని పొడిచేడు గ్రామానికి చెందిన వంగాల సత్యనారాయణ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ ,విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత 35 ఏళ్ల నుంచి ఒక కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ సైనికులుగా పనిచేస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం గుర్తించి తనను జిల్లా ఉపాధ్యక్షులు గా నియమించారని అన్నారు. తన నియమాకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, బి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ డిసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**